## క్లుప్తంగా

### ముమ్మరంగా వరినాట్లు



ఎస్‌జీఆర్‌పురం వద్ద వరినాట్లు వేస్తున్న దృశ్యం

**సరుబుజ్జిలి:** విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు దమ్ములు పట్టడం, వరినాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో ఖరీఫ్ సీజన్లో సుమారు 16 వేల ఎకరాల్లో దమ్ములు చేస్తున్నారు. ఇప్పటికే దమ్ములు పూర్తి చేసుకొని కొత్తకోట, డకరవలస, సభద్రాపురం, అవతరాబాద్, సూర్యనారాయణపురం, జొన్నవలస, మునగవలస, దన్నానపేట, కొత్తవలస, సింగన్నపాలెం, కనిమెట్ట గ్రామాల్లో వరినాట్లు వేసే పనుల్లో అన్నదాత నిమగ్నమై ఉన్నారు.

### కృష్ణదాస్‌ను కలిసిన పార్టీ పరిశీలకుడు



నాగేశ్వరరావును అభినందిస్తున్న కృష్ణదాస్ తదితరులు

**జలుమూరు:** నరసన్నపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడుగా నియమితులైన పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు ఆదివారం నరసన్నపేట ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌ను జలుమూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వాకాడను కృష్ణదాస్ అభినందించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ వాన గోపి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు ఉన్నారు.

### విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**సారవకోట:** మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై లైబ్రేరియన్ సాయమ్మ అవగాహన కల్పించారు. ఆదివారం కావడంతో పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయానికి రావడంతో వారికి పలు పుస్తకాలను ఎలా చదవాలో అవగాహన కల్పించారు.

### వసతిగృహాల్లో 418 సీట్లు భర్తీ



వసతి గృహాల వార్డెన్లతో ఎమ్మెల్యే కృష్ణదాస్

**నరసన్నపేట:** నియోజకవర్గంలోని 11 వసతి గృహాల్లో 418 సీట్లను భర్తీ చేశారు. వసతి గృహాల్లో ఉన్న ఖాళీల భర్తీకి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. దీంట్లో ఎనిమిది బీసీ వసతి గృహాల్లో 359, మూడు ఎస్సీ వసతి గృహాల్లో 59 సీట్లు భర్తీ అయ్యాయి. నరసన్నపేట బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో 93, దేశవానిపేటలో 93, ప్రియాగ్రహారంలో 24, జలుమూరులో 24, పోలాకిలో 43, ఉర్లాంలో 25, బాలురు కళాశాల వసతి గృహంలో 58, శ్రీముఖలింగంలో 21 సీట్లను భర్తీ చేశారు. ఎస్సీ వసతి గృహాలకు సంబంధించి నరసన్నపేటలో ఎస్సీ బాలికల వసతి గృహంలో 23, కోడూరులో 19, జలుమూరులో 17 సీట్లు భర్తీ అయ్యాయి. సమావేశంలో బీసీ ఏఎస్‌డబ్ల్యూ త్రినాథరావు, వసతి గృహాల మేట్రిన్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

### అందరి సహకారంతో పీఏసీఎస్ అభివృద్ధి



సూర్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

**కొత్తూరు:** పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సభ్యుల సహకారంతో కొత్తూరు పీఏసీఎస్‌ను అభివృద్ధి చేస్తున్నామని చైర్మన్ చింతాడ సూర్యనారాయణ చెప్పారు. నాలుగోసారి చైర్మన్‌గా నియమితులైన ఆయన్ని గులివిందలపేటలోని తన నివాసంలో మెట్టూరు బిట్-2 సర్పంచ్ యర్లంకి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మఠం పూర్ణ తదితరులు ఆదివారం దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వరుసుగా నాలుగోసారి తనను చైర్మన్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. 2019 నాటికి నష్టాల్లో ఉన్న పీఏసీఎస్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో ఇప్పుడు లాబాల్లో నడుస్తోందన్నారు. కార్యక్రమములో మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, జి.చినబాబు పాల్గొన్నారు.

# దోమకాటు.. పాడికి చేటు..

- తగ్గుతున్న పాలదిగుబడి
- పాడిపశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

**జలుమూరు:**

వర్షాకాలం వ్యాధులు ముసిరేకాలం. తరచూ కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ మురుగు గుంతలు, పశువులశాలల్లో నీరు నిలిచిపోవడంతో దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారుతుంటాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మూగజీవాలకు దోమలు బెడద ఎక్కువైంది. దోమలు నుంచి పశువులను సంరక్షించుకుంటే వాటి ఆరోగ్యం మెరుగుపరచడంతోపాటు పోషణ సక్రమంగా ఉండి పాడి దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. లేని పక్షంలో పశువుల ఆరోగ్యం క్షీణించి పాలదిగుబడి పడిపోతుంది. ఒక్కోసారి పశువులకు నష్టం ఏర్పడుతుందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు.

**దోమలతో జీవాలకు వచ్చే సమస్యలు**

పశువులను దోమలు కుట్టడం వల్ల పాలదిగుబగడి తగ్గుతుంది. మేత సరిగా తీసుకోలేవు. ఆకలి మందగిస్తుంది. మేత తినక పశువులు బలహీనంగా తయారవుతాయి. జ్వరం బారిన పడతాయి. పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరిగిపోతుంది. చర్మంపై దురద, దద్దుర్లు ఏర్పడి పుండ్లు ఏర్పడతాయి.

**ప్రస్తుత సీజనల్‌లో ఇబ్బంది**

సాధారణంగా వర్షాకాలం ప్రారంభమైతే చాలు దోమలు అధికగా ఏర్పడి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఇదే సమయంలో దోమలు వృద్ధి చెంది పశువులపై ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితిల్లో దోమల నుంచి పశువులను రైతులు రక్షించుకోవాలి.

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పశువులశాలలు, పాకలు శుభ్రంగా ఉంచాలి. సాధ్యమైనంత వరకూ పశువులు కట్టే ప్రదేశం సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల మూత్రం, పేడ తొలగించుకోవాలి. గుంతల్లో నీరు, వ్యర్థాలు, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రధానంగా పశువుల షెడ్‌లు, పాకల్లో దోమలు చొరబడకుండా దోమతెరలు వాడాలి. పాకల్లో గుబురుగా ఉండే పొదలు తొలగించాలి. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. పశువులు తినగా వదిలేసిన మేతను నిల్వ ఉంచకుండా చూసుకోవాలి. సాయంత్రం పాకల్లో వేప ఆకు పొగపెట్టాలి. నీరు, కుడితి తినే తొట్టిల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.



మేత మేస్తున్న పశువులు

| నరసన్నపేట నియోజకవర్గంలో జీవాల వివరాలు.. | | | | | |
|---|---|---|---|---|---|
| మండలం | ఆర్‌బీకేలు | ఆవులు | గేదెలు | గొర్రెలు | మేకలు |
| జలుమూరు | 24 | 15,733 | 490 | 31,646 | 10,748 |
| నరసన్నపేట | 24 | 15,576 | 1386 | 9,995 | 4,446 |
| పోలాకి | 20 | 14,322 | 712 | 23,300 | 9,510 |
| సారవకోట | 20 | 10,846 | 725 | 15,327 | 7,791 |

**జాగ్రత్తలు పాటించాలి**



వర్షాకాలం దోమలకు అనువైనది. వీటి నుంచి పశువులకు అనారోగ్యం కలగకుండా, పాడినష్టం వాటిల్లకుండా రైతులు చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల ఆరోగ్యం పరిశీలిస్తూ సంరక్షించుకోవాలి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగినా.. మేత తినకుండా నలతగా ఉన్నా ఆనారోగ్యం బారిన పడిందని గ్రహించి వెంటనే పశువైద్యులను సంప్రదించాలి.

-ఎం.దీప్తి,
మండల పశువైద్యాధికారి, జలుమూరు

**అప్రమత్తత అవసరం**



వర్షాకాలం ప్రారంభం అయిందంటే పశువులు, జీవాలకు పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. సూక్ష్మజీవుల కారణంగా గొంతువాపు (గురకవ్యాధి) సక్రమిస్తోంది. పశువుల ప్రాణాంతక వ్యాధుల్లో ఇది ఒకటి. ముఖ్యంగా గేదె జాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన పశువుకు అధిక జ్వరం వస్తుంది. ఇదే సమయంలో పశువులను గమనిస్తూ వెంటనే పశువైద్యులను సంప్రదించి నివారణ చర్యలు తీసుకోవాలి.

-డాక్టర్ కె.రాజగోపాలరావు,
వెటర్నరీ అసిస్టెంట్ డైరక్టర్ నరసన్నపేట

## పీఏసీఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణదాస్ తదితరులు

**సారవకోట:** ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుడితి పీఏసీఎస్ చైర్మన్‌గా మెండ సన్యాసిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతులకు మేలైన సేవలందించేందుకు వీలుగా పీఏసీఎస్‌లను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. బుడితి పీఏసీఎస్ అభివృద్ధి బాటలో నడుస్తోందని.. మరింత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లను వ్యాపార బ్యాంకులకు దీటుగా తయారు చేస్తున్నామన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, సర్పంచ్‌లు కె.శంకరరావు, గోవిందరావు, ఎంపీటీసీ సభ్యులు మెండ బాలచంద్రరావు నాయుడు, గుణుపురం రామారావు, పార్టీ నాయకులు నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్, కృష్ణారావు, మెండ రామకృష్ణ, సుందరరావు, కొండయ్య ఉన్నారు..

## వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



పొన్నాన తవిటిరాజు (ఫైల్)

**నరసన్నపేట:** చిన్న బొరిగివలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పొన్నాన తవిటిరాజు (69) స్వగ్రామం బొరిగివలసలో ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చిన్న బొరిగివలస పంచాయతీకి 15 సంవత్సరాలు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేశారు. పంచాయతీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. కాగా ఈయన సోదరుడు.. మాజీ ఎంపీపీ పొన్నాన నర్సింగరావు కూడా 2001లో గుండె పోటుతోనే మృతి చెందారు. తవిటిరాజు మృతిపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈయన మరణ వార్త తెలిసిన వెంటనే కృష్ణదాస్ బొరిగివలస చేరుకొని కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అంతిమ యాత్రలో పాల్గొన్నారు. తవిటిరాజు మృతికి సంతాపం తెలియజేసిన వారిలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, నరసన్నపేట సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, నరసన్నపేట, బొరిగివలస సర్పంచులు బూరల్లి శంకర్, పొన్నాన ప్రసాదరావులు చేశారు.

## స్నేహితుల రక్త దానం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జగన్మోహనరావు



కేక్ కట్ చేస్తున్న స్నేహితుల బృందం

**నరసన్నపేట:** స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక గోల్డెన్ బ్యాచ్ బృందం ఆదివారం రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ డి.జగన్మోహనరావు రక్తదాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇలా రక్తదానం చేయడం శుభపరిణామమని జగన్మోహనరావు గోల్డెన్ గ్రూప్ సభ్యులకు అభినందించారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు సీతారామరాజు, టి.రమేష్, సాయి శ్రీను, జామి సత్యం, ప్రతాప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**స్నేహితుల సందడి**

స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ కోచ్ రాకేష్ స్నేహితుల బృందం స్నేహితుల దినోత్సవాన్ని సందడిగా జరుపుకున్నారు. గడిచిన పదేళ్లుగా స్నేహితులుగా కొనసాగుతున్న వీరు కేక్ కట్ చేసి తమ స్నేహం ఇలా కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఏడు వార్డు స్థానాలకు 19న ఎన్నికలు

**నరసన్నపేట:** నరసన్నపేట మండలంలో ఆరు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఏడు వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 19వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో బి.మధుసూదనరావు తెలిపారు. నరసన్నపేట మేజరు పంచాయతీలోని ఏడోవార్డుతో పాటు తెలగవలసలో 1, 8, కోమర్తిలో మూడువ, మడపాంలో 8వ, మాకివలసలో రెండువ, బోడవరంలో ఎనిమిదవ, దూకులపాడులో ఎనిమిదో వార్డుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎనిమిది నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అవసరమైతే 19వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

**బుడ్డాం పంచాయతీ సర్పంచ్ పదవికి..**

**సరుబుజ్జిలి:** బప్పడాం పంచాయతీ సర్పంచ్ పదవికి ఈ నెల 19వ తేదీన ఉప ఎన్నిక నిర్వహించనున్నట్టు మండల ఎన్నికల అధికారి (ఎంపీడీవో) పీవీ మురళీమోహన్‌కుమార్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ఎనిమిది నుంచి పదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ఉంటుందన్నారు. 11, 12 తేదీల్లో అపీల్, 14న నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఖాళీగా ఉన్న తెలికిపెంట పంచాయతీలోని పదో వార్డు మెంబర్ ఎన్నిక కూడా ఇదే షెడ్యూల్ ప్రకారం జరుగుతోందన్నారు.

## పాతపట్నంలో భారీ వర్షం



పాతపట్నంలో పడుతున్న వర్షం

**పాతపట్నం:** మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పాతపట్నం మండల కేంద్రంలో సుమారు గంటన్నర పాటు ఏకదాటిగా కురిసిన వర్షంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు జలమయమయ్యాయి. కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, రొంపివలస, గంగువాడ, ఆర్.ఎల్.పురం, తెంబూరు తదితర గ్రామాల్లో కూడా భారీ వర్షం కురిసింది

## • అ'పూర్వ' కలయిక



సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దీనికి సారవకోట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపం వేదికైంది. ఈ సందర్భంగా చదువుకున్న రోజులను గర్తు చేసుకుని మురిసిపోయారు. రోజంతా సరదాగా గడిపారు. గ్రూపు ఫొటోలను తీసుకొని సందడి చేశారు.

-సారవకోట

## ప్రజల గుండెల్లో గద్దర్‌ది సుస్థిర స్థానం



గద్దర్ తో క్రిష్ణచైతన్య, సూర్యప్రకాశరావు దంపతులు

**పోలాకి:** ప్రజాపోరాటాలే ఊపిరిగా, ఉద్యమాల యుద్ధ నౌకగా పేరుగాంచిన గద్దర్ ఇకలేరనే వార్త నమ్మశక్యం కావటం లేదని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. గద్దర్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ రెండేళ్ల క్రితం ఆయనతో కలిసిన దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్‌చేసుకున్నారు. అందులో కృష్ణచైతన్య మామ.. జాతీయ బీసీ నాయకులు నూకారావు సూర్యప్రకాశ్‌రావు దంపతులు కూడా ఉన్నారు. గద్దర్ లాంటి యోధుడు భౌతికంగా లేకపోయినా, ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచే ఉంటారని కృష్ణచైతన్య పేర్కొన్నారు.

## కాజ్‌వే ఎత్తు పెంచాలని వినతి



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

**పాతపట్నం:** పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం సమీపంలో మహేంద్రతనయా నదీపై ఉన్న కాజ్‌వే ఎత్తు పెంచడంతోపాటు నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాజ్‌వే ఎత్తు పెంచకపోవడం వల్ల ఒడిశా రాష్ట్రంలో వర్షాలు కురిస్తే మహేంద్ర తనయ నదిలో నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే పైనుంచి పారుతోందన్నారు. దీంతో కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు, కూలీలు, ప్రజలు రోజూ ఈ కాజ్‌వే పై నుంచే పాతపట్నం చేరుకుంటారన్నారు. ఇటీవల ఒడిశాకు వర్షాలు పడడంతో పాతపట్నం కాజ్‌వే పైనుంచి మూడు అడుగులు నీరు పారడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు.

## మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేస్తున్న దృశ్యం

**పొందూరు:** మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. మణిపూర్ దారుణకాండను నిరసిస్తూ పొందూరులోని అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం మానవహారం నిర్వహించారు. యువతులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు, హత్యలకు పాల్పడడం దురదృష్టకరమని నినాదాలు చేశారు. ఈ సంఘటనలకు కారణమైన, ప్రేరేపిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సీహెచ్ ప్రభుదాసు, జీవన్, వసంత్‌కుమార్, నాగేశ్వరరావు, శ్రీను, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

## నేడు సమగ్రాభివృద్ధి సంకల్ప యాత్ర



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

**పాతపట్నం:** నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సమగ్రాభివృద్ధి సంకల్పయాత్రను సోమవారం నిర్వహిస్తున్నట్టు వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని తన స్వగృహం వద్ద ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట గ్రామం నుంచి ఉదయం పది గంటలకు బయలుదేరి పాతపట్నం వెళ్లి సమగ్రాభివృద్ధి సంకల్పయాత్ర ర్యాలీగా వెళ్లి ప్రారంభిస్తామన్నారు. అలాగే హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో సంకల్పయాత్ర ర్యాలీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా పని చేస్తానన్నారు. సరాలి సర్పంచ్ షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ రాజారావు ఉన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

**కొత్తూరు:** వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. గూనభద్ర వద్ద ఏబీ రోడ్డులో ఎస్సై ఎం.గోవిందులతో కలిసి వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. హెల్మెట్ పెట్టుకోకుండా వాహనాన్ని నడిపేవారిపై, మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.

## నేడు నరసన్నపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**నరసన్నపేట:** నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని సచివాలయం ఒకటి ప్రాంతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్‌లు ఆదివారం తెలిపారు. ఆదివారపుపేట, బొంతల వీధి, సత్యనారాయణనగర్, కామేశ్వరనగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నేతృత్వంలో జరగనున్న కార్యక్రమంలో నాయకులందరూ పాల్గొనాలని కోరారు.

## గుర్రపు డెక్కను తొలగించాలి



యరగాం ఓపెన్‌హెడ్ చానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

**సరుబుజ్జిలి:** వంశధార కుడి ప్రధాన కాలువతో పాటు, యరగాం- పురుషోత్తపురం ఓపెన్‌హెడ్ చానల్‌లో భారీగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన గుర్రపు డెక్క షట్టర్లు, చెక్‌డ్యామ్‌లు ఉన్న ప్రాంతాల్లోకి వచ్చి చేరిందని రైతులు తెలిపారు. దీంతో శివారు ఆయకట్టుకు సక్రమంగా సాగునీరు చేరడం లేదన్నారు. ఈ విషయాన్ని జేఈ అనిల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా తొలగింపు పనులు చేపడతామన్నారు.

## అరసవల్లిలో భక్తజనం



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అధిక శ్రావణ ఆదివారాన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి విచ్చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని స్వామి దర్శనాలకు బారులు తీరారు. కేశఖండన శాలలో తలనీలాలకు అదనపు డబ్బులు వసూళ్లు చేయకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు ఆడియో రికార్డును వినిపించడంతో దాదాపుగా అదనపు వసూళ్ల ఇబ్బందులు తగ్గాయి. అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను ఈవో వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. రూ.500 విశిష్ట దర్శనాలతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనాల లైన్లలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. కొత్తగా రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

**ఉచిత హోమియో మందుల పంపిణీ..**

ఆలయంలో దర్శనానికి వచ్చిన భక్తులకు అవసరం మేరకు ఉచితంగా హోమియో మందులను మహలక్ష్మి హోమియో క్లినిక్ డాక్టర్ పూజారి స్వాతి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రత్యేక చికిత్సలపై వివరించారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్య విధానం ఇదని, రోగనిరోధక శక్తిని పెంచేలా చికిత్సలుంటాయని డాక్టర్ స్వాతి వివరించారు.